ప్రజాశక్తి
గురువారం 4 డిసెంబర్ 2025
5
విజయనగరం

వంద రోజులు పని పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉపాధి హామీ కార్మికులు 100 రోజులు పని పూర్తి చేయాలని డ్వామా పీడీ శారదాదేవి సూచించారు. బుధవారం ఆమె సారిపల్లి పంచాయతీ కుదిపి కొండ దగ్గర 126 మంది ఉపాధి కూలీలు చేస్తున్న ట్రెంచ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొలతలు సక్రమంగా వేసి, జాబ్ కార్డుల ప్రకారం పనులు కల్పించాలని సూచించారు. జరుగుతున్న ట్రెంచ్ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు, ఎపిఒ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ

నివేదికలే మిగిలాయి..

- తోటపల్లి పూడికతీతకు నిధుల కేటాయింపేది?
- మూతపడ్డ పరిశ్రమలపై స్పందన కరువు
- గంజాయి రవాణాకు అడ్డే లేదా?
- బల్క్‌మిల్క్ సెంటర్ల అక్రమాలపై ఏం తేల్చారో?
- అమలు కాని గత డిఆర్‌సి సమావేశ నిర్ణయాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'చివరి ఆయకట్టు వరకు ఎందుకు నీరు అందించలేదు.... సమస్య ఉంటే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని తెలియదా'? అంటూ తోటపల్లి జలాశయం ఇంజినీరింగ్ అధికారులపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రులు అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారు. నివేదిక ఇచ్చి సుమారు రెండు నెలలు కావస్తున్నా అది ఇప్పటికీ ప్రభుత్వం వరకు వెళ్లలేదని సమాచారం. ఆగస్టు 14న జిల్లా సమీక్షా సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ఇందులో తోటపల్లి నీరు నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం మండలాలకు అందకపోవడంపై ఆయా ఎమ్మెల్యేలతోపాటు డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున కూడా అధికారులను నిలదీశారు. దీంతో, ఆగ్రహించిన జిల్లాకు చెందిన ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత కూడా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావట్లేదా... అంటూ నిలదీశారు. వెంటనే సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ మంత్రులు ఆదేశించడంతో అదే నెలలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తోటపల్లి ప్రధాన కాలువలో పూడిక తీతకు సుమారు రూ.32.50కోట్లు అవసరమనిప్రతిపాదనలు పంపినట్టుగా సమాచారం. కానీ, ఇప్పటికీ ఆ ఫైలు ప్రభుత్వం వరకు వెళ్లలేదు. ఇప్పటి వరకు చిల్లిగవ్వ కూడా మంజూరు కాకపోవడమే ఇందుకు తార్కాణం. వాస్తవానికి 2015 సెప్టెంబర్ 15న తొలిసారిగా అప్పటి రాష్ట్ర మంత్రి కిమిడి మృణాళిని నీరు విడుదల చేశారు. నాటి నుంచి కాలువ మెయింటెనెన్స్ చేయలేదు. దీనికితోడు పిల్లకాలులు పూర్తికాకపోవడం వల్ల లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించలేని పరిస్థితి. కుడి ప్రధాన కాలువ ద్వారా 2018 వరకు సుమారు 86వేల ఎకరాలకు సాగునీరు అందేది. దీంతో, శివారున ఉన్న గుర్ల, నెల్లిమర్ల, పూసపాటిరేగ మండలాలకు సైతం నీరు వచ్చేదని రైతులు చెబుతున్నారు. వందలాది చెరువుల్లో నీరు ఉండడంతో వరి పుష్కలంగా పండేది. ఆ తరువాత ప్రాజెక్టు కాంట్రాక్టు కాలపరిమితి పూర్తికావడంతో ప్రభుత్వం కాలువల నిర్వహణ గురించి పట్టించుకోలేదు. దీంతో, కాలువలో పూడిక పేరుకుపోయింది. సువర్ణముఖి - వేగావతి నదుల క్రాసింగ్, బాతువ రైల్వే క్రాసింగ్ సహా పలుచోట్ల వేసిన లైనింగ్ పనులు కూడా దెబ్బతిన్నాయి. ఆ డెబ్రిస్ అంతా ప్రధాన కాలువలో పడిపోయింది. ఈనేపథ్యంలో క్రమంగా సాగునీటి సరఫరా తగ్గుతూ వస్తోంది. దీనితోపాటు డిఆర్‌సి సమావేశం రోజున తనకు అందిన వినతిపత్రం మేరకు మూతపడ్డ పరిశ్రమలపై నివేదిక ఇవ్వాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటికీ ఆయా పరిశ్రమలపై సమీక్షా సమావేశంగానీ, కార్మికుల ఇబ్బందులపైగా ప్రభుత్వం గానీ, మంత్రులు గానీ ముందుకు రాలేదు. జిల్లాలో గంజాయి రవాణా, క్రయ విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్న నిర్ణయం కూడా అమలుకు నోచుకోలేదు. నేటికీ రైల్వే స్టేషన్, పూల్‌బాగ్ తదితర ప్రాంతాల్లో చిల్లరవ్యాపారం సాగుతోంది. రాత్రిపూట యువత రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. ఇక అక్రమ రవాణా నిత్యకృత్యంగా మారుతోంది. ఈ నేపథ్యంలో యువత గంజాయికి బానిసవుతున్నారు. మరోవైపు బల్కుమిల్క్ సెంటర్లలో నిర్మాణాలు, నిర్వహణలో అక్రమాలపై విచారణకు కూడా ఇన్‌ఛార్జి మంత్రి గత సమావేశంలో ఆదేశాలిచ్చారు. వీటిపై యాక్షన్ కూడా అంతంతమాత్రంగానే ఉందని సమాచారం. దీంతో, నివేదికలే మిగులుతున్నాయని, సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత అధ్యక్షతన జరుగనున్న డిఆర్‌సి సమావేశంలో ఈమేరకు చర్చ జరుగనుందో చూడాలి.

ప్రత్యేక ఆహ్వానితులుగా నామినేటెడ్ చైర్మన్లు

రాష్ట్ర ప్రభుత్వం డిఆర్‌సి సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా నామినేటెడ్ చైర్మన్లను పిలవాలని తాజాగా నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి బుధవారం జీవో జారీ చేసింది. ఆయా జిల్లాలకు చెందిన నామినేటెడ్ చైర్మన్లను ప్రత్యేక ఆహ్వానితులుగా ఇక నుంచి పిలవనున్నారు. అలాగే ప్రతి రెండు నెలలకొకసారి తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తం

ప్రజలు ఆందోళన చెందొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

స్క్రబ్ టైఫస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి సూచించారు. వైద్య అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఓరియాంటియా సుట్సుగామిషి అనే బాక్టీరియా వల్ల ఈ వ్యాధి కలుగుతుందని, పొదలు, పంటచేలు, గడ్డి మైదానాల్లో ఉండే సంక్రమిత చిగర్ మైట్స్ కాట్లు వేయడం ద్వారా ఈ వ్యాధి మనుషులకు సంక్రమిస్తుందని కలెక్టర్ తెలిపారు. అయితే ప్రజలందరూ ఆందోళన చెందవద్దని, అనుమానం ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుంటే సులభంగా బయటపడవచ్చు అని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆకస్మికంగా అధిక జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు, అలసట, శరీరంపై దద్దుర్లు కనిపించడం, కాటు వేసిన చోట నల్లటి పూతలాగా కనిపించే గాయం (ఎస్కార్) కనిపించడం స్క్రబ్ టైఫస్ లక్షణాలని తెలిపారు. ఇటువంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.

స్క్రబ్ టైఫస్‌కు డాక్సిసైక్లిన్ మందు అత్యంత ప్రభావవంతమైనదని, వైద్యుల సూచన మేరకు చికిత్స తీసుకుంటే రోగం పూర్తిగా నయమవుతుందన్నారు. గర్భిణీలు, చిన్నపిల్లలలో అజిత్రమైసిన్ వంటి ప్రత్యామ్నాయ మందులు వైద్యుల సలహా మేరకు వాడుకోవాలని సూచించారు. అవసరమైన మందులన్నీ ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా లభ్యమవుతాయని తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యాధికి వ్యాక్సిన్ అందుబాటులో లేనందున మైట్స్‌కాట్లను నివారించడమే ప్రధాన రక్షణ చర్యగా పొడవైన దుస్తులు ధరించడం, పెర్మెత్రిన్‌తో దుస్తులను శుభ్రపరచడం, ఇళ్ళు, చెరువు పరిసరాల్లో పొదలు, గడ్డి తగ్గించడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. అయితే కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల వారు స్వార్థంతో స్వప్రయోజనాల కోసం, స్క్రబ్ టైఫస్ పాజిటివ్ ఉందని భయభ్రాంతులను చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి ద్వారా అటువంటి వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు అన్ని ప్రైవేట్ వైద్య సంస్థలతో గురువారం సమావేశం ఏర్పాటుకు ఆదేశించినట్లు తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా కృషి చేయాలని, దీనికోసం వారి పేర్లు నమోదుకు అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇళ్ల స్థలాల కోసం తమ పేర్లు నమోదు చేసుకోవడానికి ఈనెల 14 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చిందని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసి, పేర్లు నమోదు చేసుకొనేలా చూడాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల మంజూరుకు గ్రామం వారీగా ప్రణాళిను రూపొందించాలన్నారు. ఆయా గ్రామాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్థలాలు, ఇంకా ఎంత కావాల్సింది తదితర వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. మ్యుటేషన్లు, ఇతర రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు కావాల్సిన సర్టిఫికేట్లను త్వరితగతిన మంజూరు చేయాలని సూచించారు. సివిల్ సప్లైస్ విభాగానికి సంబంధించి, రైస్ కార్డుల పెండింగ్ దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, గోనెసంచులు, జిపిఎస్‌తో కూడిన వాహనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రెండు రోజుల్లో బ్యాంకు గ్యారెంటీలు కూడా పూర్తి అవుతాయని తెలిపారు. బిజిలు రానిచోట మిల్లర్లతో మాట్లాడాలని సూచించారు. సివిల్ సప్లయి కార్పొరేషన్ విభాగం తరపున ధాన్యం సేకరణ పురోగతిని సమీక్షించారు. ఇన్‌ఛార్జి డిఆర్ఓ మురళి మాట్లాడుతూ, బిఎల్ఓలకు సంబంధించిన అంశాలను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారులు, పలు శాఖల అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

పెండింగ్ జీతాల కోసం గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి-దత్తిరాజేరు

గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం సర్క్యులర్ విడుదల చేసిన ప్రకారం హెల్త్ అలవెన్సులు నాలుగు వేల రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన గ్రీన్ అంబాసిడర్లు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ కోరపు కొత్తవలసలో నాలుగేళ్లు, దాసు పేటలో మూడేళ్లు, బలభద్ర రాజపురంలో ఒక ఏడాది, విజయచరాంపురంలో 20 నెలలు, గుచ్చిమిలో ఏడు నెలలు ఇలా అన్ని గ్రామాల్లోనూ వేతన బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఏళ్ల తరబడి వేతనాలు ఇవ్వకపోతే గ్రీన్ అంబాసిడర్లు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు .ప్రభుత్వం హెల్త్ హెలెన్సుల కోసం సర్కిల్ జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు అధికారులు అమలు చేయకపోవడం సరికాదన్నారు. గ్రామాలను శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్లపై దుర్మార్గంగా వ్యవహరించడం తగదని ఆమె పేర్కొన్నారు. పారిశుధ్య బళ్ల రిపేర్లు పంచాయతీలే భరించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు కె.నూకరాజు, జి.మూర్తి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కాపాడడానికి తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి పనిచేస్తున్న మాకు భద్రత కల్పించి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావుకు వినతి అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు ఎం.కృష్ణ, సింహాచలం, కోట అప్పారావు, ఈ.అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లు ముమ్మరం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెవెన్యూ వసూళ్లను ముమ్మరం చేసి లక్ష్యాలను అధిగమించాలని రెవెన్యూ సిబ్బందికి, కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఆయన సూచనలతో బుధవారం సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు పలు సచివాలయాలకు వెళ్లి రెవెన్యూ వసూళ్ల విషయాలపై సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా వారాంతపు రెవెన్యూ వసూళ్ళను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి,ఖాళీ స్థలాల పన్నులను, నీటి చార్జీలను త్వరితిగతిన వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలన్నారు. పన్ను వసూళ్ల విషయంలో నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయి ఇబ్బందులు ఉంటే తమ దష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు కూడా సహకరించి సకాలంలో పన్నులను చెల్లించాలన్నారు. దీర్ఘకాల బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేసి పన్నులు కచ్చితంగా వసూలయ్యే విధంగా కషి చేయాలన్నారు.

దోమలు నివారణకు యాంటీ లార్వాను వినియోగించాలి

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పలు ప్రాంతాల్లో పర్యటించారు. 50వ నెంబరు సచివాలయాన్ని తనిఖీ చేశారు. అన్న క్యాంటీన్ పరిశీలించారు. రహదారులపై చెత్తాచెదారాలు నిల్వ ఉండరాదని పారిశుధ్య కార్మికులకు సూచించారు.

ఘంటశాల స్మృతి గేయానికి 50ఏళ్లు

ప్రజాశక్తి -విజయనగరం కోట

అమర గాయకుడు ఘంటసాల మరణించిన వెంటనే స్పందించి అభ్యుదయ కవి సీరపాణి 1975 ఆగస్టులో రాసిన 'గాన కళా గంధర్వా.. ఘంటసాల మహాశయా!, అందుకొనుము మా జోతలు..ఆరని స్వరాల జ్యోతులు' అనే గేయానికి 50ఏళ్లయ్యాయి. 'ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం' ఘంటశాల సంతాప కార్యక్రమంలో దీనిని ప్రసారం చేసింది.' భాషా ప్రవీణ' చేసిన సీరపాణి గతంలో 'అభ్యుదయ రచయితల సంఘం' (అరసం) విజయనగరం శాఖకు కార్యదర్శిగా చేశారు. శ్రీశ్రీ, చాసో, ఆరుద్రల సరసన అరసాన్ని ప్రారంభించిన కవుల్లో సీరపాణి లబ్ధప్రతిష్ఠుడు. ఘంటసాల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తూ సరళసుందరంగా సంక్షిప్తశైలిలో ఈ గేయాన్ని అక్షీకరించారు. 'ఘంటసాల జయంతికి నివాళిగా దీన్ని మరోసారి ఆయన గుర్తు చేశాఉ. 50ఏళ్లు నిండిన ఈ గేయానికి ప్రముఖ సాహితీవేత్తల గుర్తింపు లభించి, సీరపాణిని కవిగా ఉన్నతస్థానంలో నిలబెట్టింది.

మా సాగుభూములు మాకివ్వండి

అధికారులతో చర్చల్లో గిరిజనులు

ప్రజాశక్తి-రామభద్రపురం

ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములను అన్యాయంగా ఎపిఐఐసికి కేటాయించడం సబబుకాదని కారేడువలస గిరిజనులు ముక్త కంఠంతో అన్నారు. ఈ సమస్యపై బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు, ఫారెస్టు, ఎపిఐఐసి అధికారులు, గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరిజనుల తరుపున తౌడమ్మ మాట్లాడుతూ ఆ భూముల సాగులో తాము ఎంతో ఖర్చు చేశామని, అటువంటి భూములను విడిచిపెట్టి మమ్మల్ని దూరంగా పంపడం సమంజసం కాదని అన్నారు. సుమారు 30 కుటుంబాలు ఈ భూముల ఆధారంగా జీవనాన్ని సాగిస్తున్నామని, ఫలసాయం వచ్చే సమయంలో భూములను లాక్కోవడం అధికారులకు తగదన్నారు. ఇప్పటికైనా మా గిరిజన పేద బ్రతుకులను దృష్టిలో ఉంచుకొని అధికారులు, రాజకీయనాయకులు తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. అయితే ఎపిఐఐసి డిజిఎం జయచంద్ర మాట్లాడుతూ 2017లోనే ప్రభుత్వం నుంచి తాము ఈ భూములను ఏడున్నర కోట్ల రూపాయలకు కొనుగోలు చేశామని, దీనిపై తమకు పూర్తి హక్కులు ఉన్నాయని అన్నారు. ఈ భూములను తమకు అప్పగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గిరిజనులకు కేటాయించిన ఫారెస్టు భూములు చదునుచేసి ఎపిఐఐసి తరపున ఇప్పిస్తామని, ఆ భూములు సాగు చేసుకోవాలని కోరారు. తహశీల్దార్ అజురఫీజాన్ మాట్లాడుతూ గతంలోనే కాకర్లవలస గిరిజనులు 28 మందికి రిజర్వు ఫారెస్టు భూముల్లో పట్టాలిచ్చామని, ఆ భూములు అప్పగిస్తామని స్పష్టం చేశారు. అయితే ఆ భూములతోపాటు ఒక్కో కుటుంబానికి రూ.8 లక్షలు వంతున నష్టపరిహారం చెల్లించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. నష్టపరిహారం తమ చేతిలో లేదని జిల్లా కలెక్టర్, ఆర్డీవోకు నివేదిక పంపిస్తామని తహశీల్దార్ చెప్పారు. చర్చల్లో బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు, సిపిఎం నాయకుడు బలసా శ్రీను, గిరిజనులు పాల్గొన్నారు.

గిరిజనులతో చర్చిస్తున్న అధికారులు

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

విభిన్న ప్రతిభావంతులు భారం కాదని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆనంద గజపతి ఆడిటోరియం లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు, హక్కులు, అవకాశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. శారీరకంగా, మానసికంగా, కొన్ని పరిమితులు ఎదుర్కొంటున్న, వారి ప్రతిభ, పట్టుదల, నిబద్ధత మాత్రం అసాధారణంగా ఉంటుందన్నారు. వారికి సమాన అవకాశాలు కల్పించినప్పుడు వారు సాధించగలిగిన విజయాలు ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. వారికి ప్రోత్సాహం ఇవ్వడం మనందరి బాధ్యతని, విద్య, ఉద్యోగం, రవాణా, ఆరోగ్యం వంటి రంగాలలో వారికి సౌకర్యాలు అందించాలని అన్నారు. ఈ వ్యక్తుల ప్రత్యేక అవసరాలపై అవగాహన ఉన్న ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లతో కూడిన ప్రత్యేక విభాగాన్ని ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసి సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జివి చిట్టి రాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఇంచార్జి ఎడి డి. వెంకటేశ్వరరావు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు, ఎస్ఎస్ఎ కోఆర్డినేటర్ ఎస్ సూర్యారావు, బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.భారతి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి కృష్ణప్రసాద్

జివిఎ పెరుగుదలకు రైతులే బలమైన ఆధారం : కలెక్టర్

ప్రజాశక్తి-బొండపల్లి

జిల్లాలో వ్యవసాయ రంగాన్ని సమగ్రంగా బలోపేతం చేయడం, రైతుల ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించినట్లు కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం గొట్లాం రైతు సేవాకేంద్రంలో ఏర్పాటుచేసిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమాన్ని రైతు ఆదాయం పెంపుతో కూడిన సర్క్యులర్ ఎకానమీ మోడల్‌గా ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. రైతులను ఉద్యాన పంటల వైపు ప్రోత్సహించాలని, ముఖ్యంగా ఆయిల్ పామ్, మామిడి, జీడిపప్పు వంటి పంటల్లో మొదటి ఐదేళ్లు అంతర పంటలు వేసి అదనపు ఆదాయం పొందే అవకాశాలను వివరించాలని ఆదేశించారు. డ్రోన్లు, మట్టి ఆరోగ్య కార్డులు, మొబైల్ యాప్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ వంటి అధునాతన టెక్నాలజీ వినియోగం వ్యవసాయంలో తప్పనిసరి అని అన్నారు. రైతు ఉత్పత్తులకు విలువ జోడించేందుకు గ్రామ, మండల స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ, రైతుల ఆదాయం, జీవన ప్రమాణం పెరగాలంటే వినూత్న పద్ధతుల్లో, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలు పండించాల్సిన అవసరం ఉందని సూచించారు. వ్యవసాయ ఖర్చులను తగ్గిస్తూ, ఉత్పత్తిని పెంచే ఆధునిక సాంకేతికత వైపు రైతులను తీసుకెళ్లాలని అన్నారు. డిసిసిబి తరపున ఇళ్లలో రూఫ్ గార్డెనింగ్ కోసం సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, జనసేన ఇన్చార్జ్ సురేష్, జిల్లా వ్యవసాయ అధికారి జిటి రామారావు, పలువురు రైతు సంఘం ప్రతినిధులు, రైతులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతన్న సేవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర రామసుందర్‌రెడ్డి

ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలి : జెసి

గంట్యాడ : ఆధునిక టెక్నాలజీని వినియోగించుకొని ఉద్యాన పంటలను సాగు చేయాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవ్ అన్నారు. కొర్లాం గ్రామంలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాంప్రదాయ పంట అయిన వరి దిగుబడి వచ్చినా ఆదాయము తక్కువ వస్తుందని, దీనివలన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నీటి వనరులున్న రైతులంతా ఉద్యానవన పంటలైన ఆయిల్ పామ్, కూరగాయలు, పూల పంటలు సాగు చేయడం వలన ఆదాయం వస్తుందని అన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను, కొర్లాం రైస్ మిల్లును పరిశీలించారు. కొండ తామరపల్లిలో రవిరాజ్ టమాటా గార్డెన్‌ను పరిశీలించారు. జిల్లా ఉద్యానవన అధికారి చిట్టిబాబు, తహశీల్దార్ నీలకంతేశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి బి.శ్యాంకుమార్, సివిల్ సప్లయి డిప్యూటీ తాహశీల్దార్ మూర్తి, రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

చెరకు రైతులకు తీపి కబురు

- చెరకు టన్ను మద్దతు ధర రూ.3360
- రేపు ప్యారి సుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-రేగిడి

మండలం లోని సంకిలి ప్యారి సుగర్స్ యాజమాన్యం ఈ ఏడాది చెరకు క్రషింగ్ సందర్భంగా రైతులకు తీపి కబురు అందించింది. 2025-26 ఏడాదికి చెరకు క్రషింగ్ ఈనెల 5న ఉదయం ప్రారంభించనున్నట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. చెరుకు టన్ను మద్దతు ధర రూ 3,360గా ప్రకటించారు. గత ఏడాది రూ.3,150 ప్రకటించినప్పటికీ రైతుల పెట్టుబడులను దృష్టిలో ఉంచుకొని 209 రూపాయలు అదనంగా ఇస్తున్నట్లు పేర్కొంది. గత ఏడాది ప్రకటించిన ప్రోత్సాహకాలే ఈ ఏడాది కూడా అందజేయనున్నట్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు.. రైతులు నాణ్యమైన చెరుకును కర్మాగారానికి పంపించి సహకరించాలని కోరారు. ఇప్పటికే చెరకు నరుకు బంటాలను తెప్పించామన్నారు. సాంకేతికపరమైన చెరకు నరుకు యంత్రాలు ఏర్పాటు చేశామన్నారు..గ్రామాల వారీగా చెరకు రవాణాకు లారీలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేశామన్నారు. కర్మాగారానికి చుట్టుపక్క రైతులు స్వయంగా ఎడ్ల బండ్లుతో చెరకును తీసుకురావచ్చునని తెలిపారు. సరఫరా చేసిన చెరుకును టన్నుల లెక్క ప్రకారం రైతు ఖాతాల్లోకి జమ చేస్తామన్నారు. రైతులంతా కర్మాగారం నడిపేందుకు సహకరించాలని కోరారు.

ప్యారి సుగర్స్‌లో చెరకు యార్డు

నిరసన దీక్షలో పాల్గొన్న లోకో రన్నింగ్ సిబ్బంది

కొనసాగిన రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ పిలుపు మేరకు 48 గంటల నిరహార దీక్ష రెండో బుధవారం విజయనగరం రైల్వే టూల్స్ ఆఫీస్ వద్ద కొనసాగించారు. సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన్‌రావు, బి.రమణ, డివైఎఫ్ఐ నాయకులు బి. సతీష్ ఈ శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. బ్రాంచ్ సెక్రటరీ సిఎస్ రావు, అడిషనల్ డివిజన్ సెక్రెటరీ ఐ.సింహాచలం, గూడ్స్ యూనియన్ ట్రెజరర్ పడాలరవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నవంబర్ 21న ప్రైవేటు పెట్టిన లేబర్ కోడ్స్ తక్షణమే ఉపసంహరించు కోవాలన్నారు. 2024 జనవరి 1 నుంచి డిఎ 50 శాతం పెరుగుదలకు అనుగుణంగా టిఎ రేట్లు పెంచారని, దానికి సమానంగా కిలోమీటరు భత్యంలో 25 శాతం పెంపు కల్పించాలని అన్నారు. కెఎంఎలో 70 శాతం ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని, రైల్వే బోర్డు ఆదేశాలకు అనుగుణంగా పని గంటలను 9 గంటలకు కుదించాలని, నిరంతర రాత్రి డ్యూటీలను 2కు కుదించాలని, డ్యూటీలో 72 గంటల పాటు ఉండాల్సి వస్తుందని, 36 గంటల్లో తిరిగి హెడ్ క్వార్టర్ కు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైల్వే రన్నింగ్ స్టాఫ్ భద్రత మొదటి ప్రాధాన్యతగా కేంద్ర ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాకులు, ట్రైన్లు పెరుగుతున్నా సిబ్బంది మాత్రం 15 లక్షలు నుంచి 11 లక్షలకు తగ్గారని తెలిపారు. నిరాహార దీక్షలో జి ఎస్ కుమార్, కె.శ్రీనివాసరావు, సతీష్, టి.పూర్ణచంద్ర పాల్గొన్నారు.

జివిఎ పెంపుపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట

మండలంలోని గుంకలాంగ సచివాలయంలో బుధవారం జిల్లా పశు సంవర్ధక శాఖ సంచాలకులు మురళీకృష్ణ ఆధ్వర్యాన రైతన్న మీకోసం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అనుబంధ శాఖల జివివి పెంపుదలకు గ్రామ స్థాయి ప్రణాళిక తయారు చేయడాన్ని వివరించారు. పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు, జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత డాక్టర్ ఎంఎంవి శ్రీనివాస్ రావు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిని పి.నిర్మల, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు, ప్రకతి వ్యవసాయ సిబ్బంది, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

వికలాంగుల పట్ల ప్రేమను పంచాలి

గజపతినగరం: సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వికలాంగ పిల్లల పట్ల జాలి, దయ కాకుండా ప్రేమను పంచాలని ఎంఇఒ బి.పాపినాయుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎమ్. హనుమంతరావు, పూసపాటిరేగ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.సౌభాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసికంగా, శరీరకంగా ఎదుగుదల లేని పిల్లలకు మనం చూపించే ప్రేమే వారికీ ఔషదంగా పనిచేస్తుందన్నారు. ఈ పిల్లలను సమాజంలో జరిగే అన్ని కార్యక్రమాలలో పాల్గొనేలా చూడాలని వారు తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం అనేక సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి స్థాయికి తగ్గ బోధన అందిస్తున్నామన్నారు. భవిత కేంద్రం ద్వారా అందుతున్న సేవలను ప్రత్యేక ఉపాధ్యాయులు ఎన్. బంగారునాయుడు, ఎమ్. వెంకటేశ్వరరావు వివరించారు. అనంతరం జిల్లా స్థాయి పారా ఒలింపిక్ పోటీలలో పతకాలు సాధించిన వికలాంగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు అనురాధ, కామేశ్వరి, పలువురు తల్లిదండ్రులు, వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

బాడంగి: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ లక్ష్మణదొర మాట్లాడుతూ సమాజంలోని వికలాంగుల హక్కులు, గౌరవాన్ని ప్రోత్సహించడం, వారి శ్రేయస్సు గురించి అవగాహన పెంచడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. హెచ్‌ఎం సత్యన్నారాయణ మాట్లాడుతూ శారీరక వైకల్యం ఉన్నప్పటికీ, వారి ఆలోచనలు, సామర్థ్యాలు, ప్రతిభ అపారమైనవని, వారిని సమాజంలో భాగం చేయాలని చెప్పారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఈశ్వరరావు మాట్లాడుతూ వికలాంగుల పట్ల సానుభూతి కాకుండా, వారికి సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవనం కల్పించడం మనందరి సామాజిక బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పి సత్యన్నారాయణ, సరిత ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాసరావు, శంకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: ప్రతి ఒక్క వికలాంగ విద్యార్థి తమలో ఉన్న ప్రతిభ బాహ్య ప్రపంచానికి తెలియాలంటే ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఇఒ ఎం.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ వికలాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు ఎం.చంద్రశేఖర్, టి.ధర్మశ్రీ మట్లాడుతూ మేనరిక వివాహాలు విడనాడితే అంగవైకల్యానికి గురికాకుండా ఉండొచ్చు అని అన్నారు. వికలాంగులను హేళన చేయకుండా వారిలో ఉన్న ప్రతిభను ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వికలాంగులకు ఇస్తున్న రాయితీలు, ఉపకరణాలు గూర్చి వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి ఎంఇఒ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెరకముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.తిరుపతిరావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేతేటి రామకృష్ణ, పిటి ఐఎన్ నవీన్ కుమార్, సహిత విద్య ఉపాధ్యాయులు ఎం సత్యనారాయణ, పి రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

దెంకాడ: స్థానిక భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారి కెవి.రమణ, ఎంఇఒ ఆర్.కృష్ణ, డైట్ సీనియర్ లెక్చరర్ కె.అప్పారావు, ఐఇఆర్‌టి బి.రవీంద్రరావు, కె. అప్పలరాజు, పినతాడివాడ, అక్కివరం పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఎంఇఒలు తిరుమల ప్రసాద్, పెంటయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వికలాంగులు, వారి తల్లిదండ్రులు కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించి వివిధ క్రీడలలో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పి చింతల రాజేశ్వరి, తేజస్విని, ప్రత్యేక ఉపాధ్యాయులు కళావతి, వికలాంగ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భోగాపురం : స్థానిక ఎంపిపి పాఠశాల పరిధిలోని భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ యాక్టివిటీలతో పాటు పిల్లలకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వికలాంగులను మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమిషనర్ రామలక్ష్మి, మెప్మా ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ ఆత్మస్థైర్యంతో వికలాంగులు ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఒ జగన్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలోని వల్లంపూడి భవిత కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన వికలాంగుల దినోత్సవంతో పిల్లలకు వైకల్యాలు రావడానికి గల కారణాలను పలువురు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల పోటీల్లో గెలిపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, వికలాంగుల ప్రత్యేక ఉపాధ్యాయులు నిరుజోగి సత్యవతి, పేరెంట్స్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: వికలాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించవలసిన భాధ్యత సమాజంపై వున్నదని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు అన్నారు. స్థానిక కారుణ్య కార్యాలయంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించి 16 మంది వికలాంగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య ఉపాధ్యక్షులు నాగురు రమేష్, రాంబాబు, చిన్నారావు, సోమేశ్, కృష్ణ మోహన, రమేష్ చందు, రమేష్ పాల్గొన్నారు.

దత్తి రాజేరు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో భవిత కేంద్రం ఐఆర్‌పిలు శ్రీను, సంధ్యారాణి ఆధ్వర్యంలో పిల్లలకు క్రీడా పోటీలను నిర్వహించారు. వీరికి డిప్యూటీ ఎంపిడిఒ బి.రవి చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం శశికళ, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

శృంగవరపుకోట: వైకల్యం వైఫల్యం కాదని జూనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవ కమిటీ చైర్‌పర్సన్ బి.కనకమాలక్ష్మి అన్నారు. మండల న్యాయ సేవా కమిటీ, సమగ్ర సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో పట్టణంలోని భవిత సెంటర్లో బుధవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సదస్సులో ఎంఇఒ పి.గణపతి లక్ష్మి, న్యాయవాదులు జి.ప్రకాశరావు, వారాధి ఈశ్వరరావు, బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంఇఒలు జి.శ్రీదేవి, బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.నాగేశ్వరరావు. సాహితీ ఉపాధ్యాయులు పి. కనకరాజు, అవతారం, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: స్థానిక భవిత కేంద్రంలో బుధవారం జరిగిన వికలాంగుల దినోత్సవంతో న్యాయమూర్తి ఏ.విజయ రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ వికలాంగుల ధైర్యం, వారి బలం మనకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఎన్నో విజయాలు సాధించిన వారిలో వికలాంగులకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఇఒ విమలమ్మ, సాయి చక్రధర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేగిడి: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ కృష్ణలత, ఎంఇఒ ఎం.వరప్రసాదరావు వికలాంగ విద్యార్థులకు దుప్పట్లు, భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెటిక్ వైద్యులు సందీప్ కుమార్, ఐఆర్ కోఆర్డినేటర్ యు.మహేశ్వరి, రాజేష్ పాల్గొన్నారు.

కొత్తవలస: వికలాంగ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఇఒ

పూసపాటిరేగ: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ పాపినాయుడు

ఎస్.కోట: ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వేపాడ: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ

జీరో టిల్లెజ్‌తో మొక్క జొన్న రైతుకు మేలు

నెల్లిమర్ల: జీరో టిల్లెజ్‌తో మొక్క జొన్న సాగు రైతుకి ఎంతో మేలు జరుగుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సతివాడలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు వ్యవసాయ క్షేత్రంలో ఫౌండేషన్ అందించిన డబుల్ వీల్ మార్కర్‌తో మొక్క జొన్న నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వరి కోతలు పూర్తయిన తరువాత దున్నకుండా మొక్క జొన్న నాటడం వల్ల రైతుకి మేలు జరుగుతుందని అన్నారు. ఎకరానికి 6 నుంచి 7వేల రూపాయలు వరకు ఆదా అవుతుందని, దిగుబడి కూడా పెరుగుతుందని తెలిపారు.

డిప్యూటీ ఎంపిడిఒ శైలజ బాధ్యతల స్వీకరణ

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒగా జి. శైలజా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కొత్తవలస మండలం గ్రామ సచివాలయం పరిధిలో గ్రేడ్ వన్ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తూ పదోన్నతపై డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు.

విఆర్‌ఎల ధర్నాను విజయవంతం చేయండి

వేపాడ: విఆర్‌ఎల ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షులు గంటి వ్యాకరణం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ జె.రాములమ్మకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గ్రామ సహాయకులుగా పనిచేస్తున్న వారి సమస్యలు పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఎదుట ఈ నెల 5 నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

బాడంగి: మండలంలోని కామన్నవలస సమీపంలోని శ్రీసోమేశ్వర ఐఒసిఎల్ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం బాడంగి అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ వి.రామసూర్యారావు తన సిబ్బందితో కలిసి పెట్రోల్ బంకు వద్ద సిబ్బందికి అగ్ని ప్రమాదాలు, భద్రతపై అవగాహన కల్పించారు. బంక్‌లో ఆయిల్ కొట్టేటప్పుడు సెల్ ఫోన్ వినియోగించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఒసిఎల్ పెట్రోల్ బంక్ యజమాని, ఎంపిటిసి, రాష్ట్ర టిడిపి ఎస్‌టిసెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు, తదితరులు పాల్గొన్నారు.

రూ.71.40లక్షలతో అభివృద్ధి పనులు

దెంకాడ: మండలంలోని పేడాడ, రాజుల తమ్మాపురం గ్రామాల అభివృద్ధికి రూ.71.40 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రకటించారు. 'మన ప్రజలతో మన ఎమ్మెల్యే' అనే కార్యక్రమంలో ఈ గ్రామాలను సందర్శించి గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీలో భాగంగా గ్రామాభివృద్ధికి నిధులు వెచ్చించామన్నారు. ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణం వంటి కీలక మౌలిక వసతి పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో రెండు బోర్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణాలకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

ర్యాంపు నిర్మాణానికి ఆర్థిక సాయం

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేట ఉన్నత పాఠశాలకు ర్యాంపు నిర్మాణానికి ఆ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్య రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. దీంతో బుధవారం ర్యాంపు నిర్మాణ పనులను ప్రారంభించారు. పాఠశాల కొండపై ఉండటం, ప్రధాన గేటు వద్ద ర్యాంపు సరిగా లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాకయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన బంగారయ్య మాస్టారు సొంత నిధులు వెచ్చించి ర్యాంప్ నిర్మాణం చేపట్టారు. పాఠశాల అభివృద్ధిలో వ్యక్తిగతంగా ముందడుగు వేసిన ఉపాధ్యాయుడు బంగారయ్య సేవాస్ఫూర్తిని పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

గురుకుల పాఠశాల అభివృద్ధికి నిధులు ఇవ్వండి

బొబ్బిలి: స్థానిక గురుకుల పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గురుకుల పాఠశాలలో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాల అభివృద్ధికి రూ.4.30 కోట్లతో ప్రతిపాదనలను మంత్రికి అందించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు బేబినాయన చెప్పారు.

డాక్టర్లుగా చదివే అవకాశం కల్పించాలి

చీపురుపల్లి : రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం వల్ల పేద విద్యార్థులు డాక్టర్లుగా చదివి అవకాశాన్ని కోల్పోతారని వైసిపి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఆదర్శ డిగ్రీ కాలేజీ, యస్‌విఆర్. డిగ్రీ కాలేజీ, గాయత్రి జూనియర్ కళాశాల, సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుమార్తె బొత్స అనూష, స్థానిక వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, మీసాల వరహాల నాయుడు, బెల్లాన వంశీ మాట్లాడుతూ పేదలు డాక్టర్లుగా చదివే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దన్నాన జనార్ధన్, నాయకులు బెల్లాన త్రినాధరావు, బమ్మిడి కార్తీక్, పతివాడ రాజారావు, యమ్‌ఎస్‌ఎన్ రాజు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ కళాశాల వద్ద వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బొత్స కుమార్తె బొత్స అనూష, నాయకులు రమణరాజు, వెంకటరావు, తాడ్డి వేణు, సంగం రెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై దృష్టి పెట్టండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

ఆధునిక వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ రవణమ్మ, ఎంపిడిఒ స్వరూపారాణి, మండలాధికారి సీతారామరాజు, జనసేన మండల అధ్యక్షులు వందనాల రమణ, క్లస్టర్ ఇన్చార్జి పల్లంట్ల జగదీష్, నాయకులు పడాల శ్రీనివాసరావు, గుండపు సూరిబాబు, కర్రోతు శ్రీనివాసరావు, దిలీప్ పాల్గొన్నారు.

భోగాపురం: రైతులకు విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే

జామి: జామి, మోకాస కొత్తవలస రైతు సేవా కేంద్రాలలో రైతన్నా మీకోసం వర్క్ షాపు నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఒ పూర్ణిమ మాట్లాడుతూ వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక పై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చిప్పాడ లక్ష్మి, ఎమ్‌పిటిసి చిప్పాడ సూర్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు వర్రి రమణ, పోలుబర్తి స్వామినాయుడు, రైతులు పాల్గొన్నారు

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ గ్రామంలో బుధవారం రైతన్నా మీకోసం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ పి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం 5 సూత్రాలు ప్రవేశ పెట్టిందని దీనిలో నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కార్యక్రమాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం, సాగుబడి లాభం కోసం ఐదు సూత్రాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్, ఎఇఒ శ్యాం, రైతులు పాల్గొన్నారు.

దెంకాడ: మండలంలోని పినతాడివాడ, అక్కివరం గ్రామాల్లో రైతన్నా మీకోసం ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ టి. సంగీత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో వివిధ పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు, పినతాడివాడ ఎంపిటిసి అచ్చుంనాయుడు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, ఎఇఒ బి. రామకోటి, విఎఎ రాంబాబు, విఆర్ఒ రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో బుధవారం రైతన్నా మీకోసం గ్రామ సభలో ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి రైతు వ్యవసాయంలో కొత్త సాగు విధానం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎం.స్వాతి కుమారి, మండల అసిస్టెంట్ హక్కునాయుడు, గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

వాహనాలు వేలం

మెంటాడ: ఆండ్ర ఎస్ఐ కె.సీతారాం సమక్షంలో ఆండ్ర పోలీస్ స్టేషన్‌లో వాహనాలను బుధవారం వేలం వేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పాల్గొని మొత్తం నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను వేలం వేశారు. వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం 36 కేసుల్లో స్వాధీనం చేసుకున్న వస్తువులను ధ్వంసం చేశారు.

విద్యార్థుల శ్రమదానం

బొబ్బిలి: మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థులు బుధవారం శ్రమధానం చేశారు. జగన్నాధపురంలో వాసు జూనియర్ కళాశాల, కొత్తపెంటలో శ్రీవిద్య జూనియర్ కళాశాల విద్యార్థులు, గున్నతోటవలసలో ఎస్‌ఎస్‌ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులు నిర్వహించి పాఠశాల పరిసరాలు, రోడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు కృష్ణ శాస్త్రి, రెడ్డి ధనుంజయనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సిబ్బంది విధులు నిర్వహణపై ఆరా తీశారు. ప్రధానంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

దెంకాడ: సచివాలయ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని డిప్యూటీ ఎంపిడిఒ కె.రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని సింగవరం సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకుని రికార్డులను తనిఖీ చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించాలని, బయటకు ఇతర పనుల మీద వెళ్లేటప్పుడు సంబంధిత పంచాయతీ కార్యదర్శి దృష్టిలో పెట్టాలని సూచించారు.

మెంటాడ: సచివాలయ సిబ్బంది ప్రజలకు మరింత చేరువై సేవ చేయాలని ఎంపిడిఒ పప్పు సుదర్శన్ సూచించారు. బుధవారం మీసాలపేట, చల్లపేట, కొంపంగి సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందిక పలు సూచనలు చేశారు. సిబ్బంది హాజరు పట్టికతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహంతి సత్యారావు మీసాలపేట పంచాయతీ కార్యదర్శి తాతారావు, రాబంద కార్యదర్శి సత్యనారాయణ, చల్లపేట కార్యదర్శి లక్ష్మీ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు తీర్చాలి

ప్రజాశక్తి - కొత్తవలస

అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన కోర్కెలు తీర్చాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు డిమాండ్ చేశారు. బుధవారం ఐసిడిఎస్ అధికారికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు గౌరవవేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 1810 మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్చాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు కూడా వర్తింపజేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ మండల అధ్యక్షులు బేబీ రాణి, ప్రధాన కార్యదర్శి రావయ్యమ్మ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలో మామిడివలస మాజీ సర్పంచ్ మండల సన్యాసి రావు (54) చికిత్స పొందుతూ బుదవారం మృతి చెందినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నవంబర్ 28 రాత్రి భూసాయవలస వద్ద సన్యాసిరావు నడుపుతున్న బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో రోడ్డు తలకు తీవ్రగాయాలయ్యాయి. జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారని చెప్పారు. ఈతయన గతంలో మామిడివలస సర్పంచ్‌గా చేశారు. ఇతనకు బార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

ఇద్దరికి జైలు శిక్ష

ప్రజాశక్తి- సంతకవిటి

స్థానిక పోలీసు స్టేషన్‌లో 2020లో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో గొళ్ళవలస గ్రామానికి చెందిన వెంపటాపు గోపి (35), కొప్పల రామినాయుడు (50)లకు శ్రీకాకుళం ప్రత్యేక కోర్టు జడ్జి ఎస్‌ఎం ఫణికుమార్ 4 సంవత్సరాలు 6 నెలల జైలు శిక్ష, రూ.12వేలు చొప్పున జరిమానాలు విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్‌పి దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం పనుల ఆడిట్ సమయంలో బాధితుడు చింతాడ అసిరయ్యను కులదూషణ చేసి, కర్రతో దాడి చేసినట్లు దర్యాప్తులో రుజువుకావడంతో కోర్టు ఈ శిక్షలను విధించినట్లు ఎస్‌పి వివరించారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ప్రతి మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదగాలని ఎపియం పి.భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో విఒఎ, గ్రామ సమాఖ్య అధ్యక్షులు మోడల్ మండల సమాఖ్యగా ఎంపికైనందున మండల వార్షిక కార్యాచరణ ప్రణాళిక-1 మూడు రోజులు శిక్షణలో భాగంలో మొదటి రోజు శిక్షణలో ఆమె మాట్లాడారు. విజన్ బిల్డింగ్‌కు మండలం ఎంపికైందని చెప్పారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తులు సృష్టి, ప్రవర్తనలో మార్పు, సుస్థిర జీవనోపాదులు, సామర్థ్యాల పెంపు తదితర అంశాలకు సంబంధించి సూచనలు చేశారు. ఆట, పాటలు, కథలు రూపంలో వివరించారు. ఈ కార్యక్రమం ఎల్‌సిసి శ్రీహరిరావు, సీసీలు కోటి, నిర్మల, కేశవ రావు, కృష్ణారావు, ఎంఎస్ సెక్రటరీ అల్లాడ లక్ష్మి, ఎంఎస్‌ఎ జయలక్ష్మి, విఒఎలు, గ్రామ సమాఖ్య సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: మహిళా సంఘాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎంపిడిఒ ఐ.సురేష్ కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం భాగ్యలక్ష్మి

స్థానిక మండల సమైక్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డిపిఎం జి.సీతారామయ్య, ఎపిఎం ఎన్. అప్పలనాయుడు, డిజిఎం దుర్గాప్రసాద్, సీసీలు, విఒఎలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సంతకవిటి: మోడల్ గ్రామ సమాఖ్యల వార్షిక కార్యాచరణ ప్రణాళికపై మూడు రోజులు మండలస్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం సంతకవిటి వెలుగు కార్యాలయంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎపిఎం దదికుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో ఎంపికైన 10 మండల సమాఖ్యల్లో సంతకవిటి మండలం చోటు దక్కడం ఆనందకరం అని అన్నారు.

గజపతినగరం : స్థానిక వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్ పై బుధవారం జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు వెలుగు డిఆర్‌డిఎ అదనపు పథక సంచాలకులు కె. సావిత్రి హాజరై మాట్లాడుతూ రాబోయే 5 సంవత్సరాలలో సంస్థలను బలోపేతం చేయాడానికి, లక్ష్యం చేరుకోవడానికి ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలి, నాయకత్వ బలోపేతం, మహిళా నాయకుల సామర్థ్యాలు పెంపు మొదలగు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సంస్థాగత నిర్మాణం డిపిఎం ఏ.చిరంజీవి, బ్యాంక్ లింకేజి డిపిఎం జె.లక్ష్మునాయుడు, ఎపిఎంలు నారాయణ, విశ్వేశ్వరరావు, పద్మ, శేషగిరిరావు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - బొబ్బిలి

అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా, మండల స్థాయి అధికారులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలపై దృష్టి పెట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం ఆయన మాటాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు రూ.1.50 ఇచ్చి పౌష్టికహారం పెట్టమంటున్న ప్రభుత్వం ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ఒకొక్క కేంద్రంలో 10మంది పిల్లలు ఉంటే రూ.15 మాత్రమే వస్తుందని, అ డబ్బులతో నూనె, టమోటా, ఇతర సామాగ్రి కొనుగోలు చేసి భోజనాలు పెట్టాలన్నారు. ఒక ఇంటిలో 10మంది ఉంటే రూ.15 సరిపోతుందా అని ప్రశ్నించారు. అంగన్వాడీ కేంద్రాలను జిల్లా, మండల అధికారులు విజిట్ చేసి అంగన్వాడీలను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. గ్రామాలలో తాగునీరు, రోడ్లు, కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మున్సిపాలిటీలో చెత్త తరలించే ట్రాక్టర్లు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, గోతులు రోడ్లతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం ఉన్నారు.

రూ.4 కోట్లతో ఎంఎస్ఎంఇ పార్కులో సౌకర్యాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని కాకర్లవలస సమీపంలో నెలకొల్పనున్న ఎంఎస్ఎంఇ పార్కులో రూ.4కోట్లతో మౌళిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎపిఐఐసి డిజిఎం జైచంద్ర తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 1.3 కిలోమీటర్ల రోడ్డు, డ్రెయిన్స్, కల్వర్టులు ఈ నిధులతో నిర్మించనున్నామని, మొదటి విడతగా 20 ఎకరాల్లో ప్లాట్లు అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. సుమారు 139 ప్లాట్లు ఏర్పాటు చేయనున్నామని, ఒక్కొక్క ప్లాట్ 300 స్క్వేర్ మీటర్లుగా నిర్ణయించామని, ఒక్కొక్క స్క్వేర్ మీటర్ రూ.1112లుగా నిర్ణయించామని చెప్పారు. ఎస్‌సి ఎస్‌టిలకు 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. ఈ అవకా శాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవా లని కోరారు. సమావేశంలో ఎపిఐఐసి జెఇ రాజేష్ పాల్గొన్నారు.

ఎర్త్ సమ్మిట్‌తో గ్రామీణాభివృద్ధి

ప్రజాశక్తి - చీపురుపల్లి

గ్రామాలను అభివృద్ధి చేయటానికి ఎర్త్ సమ్మిట్ దోహదపడుతుందని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ సాంకేతికత, ఆర్థిక నూతన పరిష్కారాలపై దృష్టి సారిస్తూ, నాబార్డ్ ఐఎమ్ఎఐతో కలిసి ఈ నెల 5,6 తేదీల్లో గుజరాత్ రాష్ట్రం, గాంధీనగర్‌లో నిర్వహిస్తున్న 'ఎర్త్ సమ్మిట్ 2025' జరుగుతుందని చెప్పారు. ఎంపవరింగ్ అగ్రికల్చర్, రూరల్ టెక్ అండ్ హ్యూమానిటీలో పాల్గొనడానికి అన్ని స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంకులు, జిల్లా సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకుల ఎండిలను, అధ్యక్షులను ఆహ్వానించారన్నారు. ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా తాను హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సదస్సు ద్వారా గ్రామీణాభివృద్ధికి నూతన సాంకేతికతలు, డిజిటల్ పరిష్కారాలు, ఆర్థిక సేవలలో కొత్త అవకాశాలను అధ్యయనం చేసే అవకాశం లభిస్తోందన్నారు.

అధికంగా టెన్త్ పరీక్ష ఫీజు వసూలు

ప్రజాశక్తి - రామభద్రపురం

పది పరీక్షా ఫీజుల్లో అధిక వసూళ్లు చేయడంపై తల్లి దండ్రులు మండిపడుతున్నారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నిర్ణయించిన పరీక్ష ఫీజు రూ.125 కాగా ఇక్కడ ఒక్కో విద్యార్థి నుంచి రూ.200 వసూలు చేశారు. ఇదే విషయాన్ని ప్రజాశక్తి విచారణలో విద్యార్థులు, తల్లి దండ్రులు ధృవీకరించారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎంఇఒ తిరుమలప్రసాద్ కూడా పత్రికల్లో 125 మాత్రమే ఫీజు రూపంలో తీసుకోవాలని ప్రకటించారు. అయిన ఒక్కో విద్యార్థి నుంచి రూ.200 వసూలు చేసినట్లు విద్యార్థులు చెపుతున్నారు. ఇదే విషయమై హెచ్‌ఎం గోపాలనాయుడుని ప్రజాశక్తి వివరణ కోరగా ఫీజు రూ. 125 కాగా విద్యార్థులు పాస్ ఫోటోలకు, దరఖాస్తులు ఆన్‌లైన్ చేసేందుకు రూ.75 అదనంగా తీసుకుంటున్నామని తెలిపారు. దీనిపై ఎంఇఒ వివరణ ఇస్తూ విద్యార్థి నుంచి రూ.125 మాత్రమే తీసుకోవాలని చెప్పారు అయితే ప్రజాశక్తి వివరణ కోరిన వెంటనే ఒక్కో విద్యార్థికి రూ.25 తిరిగి ఇచ్చేశారు. ఇక్కడ సుమారు 165 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు.